

# అనుబంధాలు

— జి. ఉషాలావణ్య

హడావుడి పడుతూ సామాన్లన్నీ సరిగ్గా వున్నాయా లేదా అని చూసుకుని కూతురుకి దబ్బులిస్తూండగానే బయల్దేరింది రైలు.

ఇంకా బాగా తెల్లవారలేదు. మసక చీకటిని చీల్చుకుంటూ పోతున్నట్టు పెద్దగా కూత వేస్తూ సిటీ లిమిట్స్ దాటి స్పీడందుకుంది.

ఎప్పుడెప్పుడు పక్కలు పరిచి కాసేపు పడుకుందామా అని వుంది నాకైతే. అందుకే మాతోపాటు అదే స్టేషన్‌లో ఎక్కినతను కింద బెర్త్‌లో పక్క పరుచుకునేందుకు తయారవటం చూసి నేను పై బెర్త్ ఎక్కేసాను. కానీ కాఫీ, టీలు అమ్మేవాళ్ళ అరుపులతో ఎక్కువసేపు పడుకోలేకపోయాను. సరళ, క్రింది బెర్త్ శాల్తీ మాత్రం మంచి నిద్రలో పడ్డారు.

చేసేదేం లేక తిరిగి పడుకోబోతూ ఎదుటి అప్పర్ బెర్త్‌లోని వ్యక్తివైపు చూశాను. మోచేయి నుదుటికి ఆనించుకుని పడుకుని నన్నే చూస్తున్నాడు! నేను అతన్ని గమనించానని తెలిసి కూడా చూపు మరల్చుకునే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు.

ఇక పడుకుని వుండటం నావల్ల కాదనిపించింది. బాగ్‌లోంచి బ్రష్, పేస్టు తీసుకుని దిగాను. నాతోపాటు అతనూ తువ్వాలు, పేస్టు తీసుకుని దిగాడు - నేనేం చేస్తే దానికి డిట్టో! బాగా ఘాటుగా ఏమైనా అందామని వుందిగాని ఏ కారణం చూపించను?

మొహం కడుక్కుని వచ్చి సరళను లేపేసాను. మా మాటలకి పాపం కింది బెర్త్ శాల్తీ కూడా లేచేశాడు.

మొహాలయితే కడిగాం గాని అంతా 'చాయ్ చాయ్' అనేవాళ్ళే! నాకు పొద్దున్న ఒక గుక్క కాఫీ పడితేగాని ప్రాణం నిలవదు. మా సమస్య అర్థం చేసుకుని 'డైనింగ్ కార్ వుందండీ. కాఫీ కూడా దొరుకుతుంది' అంటూ అందరికీ కాఫీకి ఏర్పాటుచేసి వచ్చాడు పై బెర్త్ శాల్తీ మాకెదురుగా కూర్చుంటూ.

ఉపకారం చేసిన మనిషి పట్ల సరళకు అపారంగా కృతజ్ఞత పెరిగిపోయింది. నాకేమో ఇంకా మంటగానే వుంది మనసులో. ఆడపిల్లలకు సహాయ పడినట్టు నటించి దాన్ని స్నేహం పేరిట ప్రేమలోకి దించి మోసాలు చేసే ఘరానా దొంగల్ని ఎంతమందిని చూశాను.

అంతవరకు ఎటో అదృశ్యమైపోయిన క్రింది బెర్త్ శాల్తీ తువ్వాలుతో మొహం తుడుచుకుంటూ వచ్చి కూర్చున్నాడు. మమ్మల్ని చూడగానే ఆనందమో, ఆశ్చర్యమోగాని కనుబొమలు ఎగరేసి ముందుగా సరళను పలకరించి తనను పరిచయం చేసుకున్నాడు. మేము ఎమ్.ఏ.లో వున్నప్పుడు చంద్రబాబు గ్రూపులో వుండి ఎలక్షన్లలో సరళతో పోటీ చేసింది అతనే అట! అంతే అప్పటి విరోధాలన్నీ మరచిపోయి ఇద్దరూ యూనివర్శిటీ రాజకీయాల్లో పడిపోయారు. పై బెర్త్ శాల్తీ కూడా కలుగజేసుకుని ఏ బ్యాచి, ఏ సబ్జెక్టు అని మా అందరి వివరాలు అడుగుతున్నాడు. ఈ కాలేజీ పాలిటిక్స్‌లో నాకంత అభిరుచి లేదు. వెంటతెచ్చుకున్న నవల చదువుదామంటే పొద్దున్నే దాని మీద మనసు నిలవడం లేదు. కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాను.

ఏదో చిన్న స్టేషన్. ఆగక పోయినా నిదానంగా వెళ్తోంది రైలు. ప్లాట్‌ఫారం దాటాక పట్టాలకు కాస్త దూరంగా నిలబడి చేతులూపుతున్నారు పిల్లలు. నాకూ ఉత్సాహం వచ్చింది. చూస్తున్న పుస్తకం పక్కన పడేసి చెయ్యూపడం మొదలుపెట్టాను. ఒక్కడూ నావైపు చూడడే! ఎటెటో చూస్తూ చేతులు మాత్రం జోరుగా ఊపేస్తున్నారు. రైల్లో ఒక్కరైనా వాళ్ళకసలు చెయ్యూపి వుంటారా అని ఉక్రోషంతో కూడిన అనుమానం వచ్చేసింది. అంత ప్రేమగా, చెయ్యి నొప్పిపుట్టేలా, వాళ్ళు పూర్తిగా కనుమరుగయేవరకు ఊపినా ఒక్కడూ నావైపు చూసినట్టు లేదు. మొద్దు మొహాలు!

ఆ మాటే కసిగా పైకన్నాను.

"మీరు కరెక్టు పర్సన్ని ఎంచుకోలేదు."

నవ్వుతున్నాడు ఎదురు బెర్త్ శాల్తీ. అందరితో పాటు నేనూ కాస్త నవ్వినా ఉదయం సంఘటన గుర్తొచ్చి గంభీరంగా అయిపోయాను.

కిటికీ లోంచి చల్లగాలి హాయిగా వుంది. అదే సరళతో అంటే 'చాలా విసురుగా వుంది. కళ్ళు తెరుచుకోవటం లేదు,' అంది. తనవైపుకి వంగి చూస్తే నిజమే...! ఎదుటి కిటికీ లోంచి చాలా విసురుగా వస్తోంది గాలి. 'ఔనే!' అని అంతలోనే సర్దుకుని 'పోన్లే. నాకు రావటం లేదు,' అన్నాను. అంతే నన్నిక నవల అంటుకోనీలేదు సరళ. వాళ్ళంతా తిరిగి రాజకీయాలు - విద్యార్థి సంఘాలు నుంచి సినిమాల మీద పడ్డారు. చివరికి కబుర్లతో అలసిపోయి వన్-బై-టు చాయ్‌కి ఆర్డర్ ఇచ్చారు.

సరళకు, నాకు బాగా వేడిగా తాగటం అలవాటు. సరళ కప్పు పెదాలని అంటించుకుని తాగబోతోంటే 'ఆగాగు' అని నా చేతిలో కప్పుని తాటిస్తూ 'చీర్స్' చెప్పాను. ఊహించలేదేమో సరిగ్గా అప్పుడే చెయ్యి వెనక్కు తీసుకుంటున్న సరళ చేతిలో కప్పుకి కాస్త గట్టిగానే తగిలి టీ అంతా చీరమీద ఒలికిపోయింది.

ఒక్క క్షణం అందరం నిశ్శబ్దంగా అయిపోయాం. ఆ తర్వాత నవ్వులతో మారుమోగిపోయింది వాతావరణం.

"నీ 'చీర్లు' పాడుగాను! చూడు నా చీరంతా ఎలా పాడయిందో," అంది సరళ.

"అలా అయినా గొప్పగా ఫీలయిపోయి తాగుదామనుకుని వుంటారు," యూనివర్సిటీ రాజకీయ నాయకుడు అన్నాడు నవ్వుతూ.

"చూస్తుంటే మీ స్టూడెంట్ల కంటే మీరే ఎక్కువ అల్లరి చేసేలాగున్నారు. మీ మాట వింటారా వాళ్ళు? లేకుంటే వాళ్ళ మాట మీరు వింటారా?" పై బెర్త్ శాస్త్రి అనుమానం!

"ఈవిడా! తల అటు ఇటు తిప్పనివ్వదని షికాయత్తులు చేస్తారండీ వాళ్ళ స్టూడెంట్స్ నేను వెళ్తే!" అంది సరళ.

"నిజమే! ఎవరిదగ్గర ఎలా వుండాలో తెలిసి మసులుకోడం నిజంగా గొప్ప ఆర్టు!"

కాసేపయాక నిద్ర వస్తోంది అంటూ పై బెర్త్ కెక్కింది సరళ. నేను వెంట తెచ్చుకున్న నవల మొదలేసాను. మొదట కాస్త విసుగనిపించినా పోను పోను ఇంటరెస్టింగ్‌గానే వుంది. పరిసరాలన్నీ మర్చిపోయి అందులో పూర్తిగా లీనమైపోయాను.

ఎప్పుడొచ్చాడో కూల్‌డ్రింక్స్ కుర్రాడు.


ఎదుటి బెర్త్ (పై బెర్త్) శాస్త్రి తనతోపాటు నాకూ ఆఫర్ చేస్తున్నాడు.

"ఎందుకండీ!" మొహమాటంగా అన్నాను.

"పర్వాలేదు. తీసుకోండి."

చూస్తుంటే మర్యాదస్తుడిలాగానే వున్నాడు. నేనే అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నానేమో!

"ఈ ప్రయాణాలు చేయటమంత బోరింగ్ థింగ్ ఇంకోటి వుండదు. ఇంట్లో వున్నట్టు ఎప్పుడేం చేయాలనుకుంటే అది చేయలేం కదా! అందుకే మీరు పడుకున్నంతవరకు నేనూ పడుకున్నాను. మీరు లేస్తే నాకూ లేవాలనిపించింది," అన్నాడు. సంజాయిషీ ఇచ్చే స్వరం కాదది. చాలా మామూలుగా జరిగింది చెబుతున్నట్టు చెప్పాడు. అంతవరకు అతడంటే వున్న అభిప్రాయం 'పోనీలే' అనుకుని కాస్త మారింది.



✳ పచ్చి మిరపకాయల్ని ఉడుకు నీటిలో కాసేపు వుంచి తీసి, ఎండలో ఓ రోజంతా ఎండ బెడితే, రంగు మారిపోయి, కారం చాలా తగ్గిపోతుంది. సమోసా లాంటి వాటితోపాటు వీటిని తినవచ్చు.

-భోశ్రీ

మమ్మల్ని చూసి సరళ కూడా లేచి కూర్చుంది, "అన్యాయం మీరు మట్టుకే తాగేస్తున్నారు," అంటూ.

"మీరు పడుకున్నారు కదా," అంటూ తనకూ తెప్పించి ఇచ్చాడు.

ఆలోచిస్తే అతని మాటల్లోగాని చేతల్లోగాని ఎక్కడా వెకిలితనం కనిపించలేదు. తెచ్చిపెట్టుకున్న హుందాతనమూ లేదు. అలా తనకు తోచింది చేసెయ్యడమూ, మనసులో మాట స్పష్టంగా చెప్పటమూ అలవాటైన పనిలా, ఎదుటి మనిషిని అంచనా వేయటం చాలా సులభమైన పనిలా వున్నట్టుంది అతడి వ్యవహార సరళి చూస్తుంటే.

నేను తిరిగి నవల చదువుకోబోతుంటే లాగేసింది సరళ, 'వద్దు. నాకు బోరు కొడుతోంది' అంటూ.

"అయిపోవచ్చింది... ఒక్క పది నిముషాలు. చాలా ఇంటరెస్టింగా వుంది" అభ్యర్థిస్తున్నట్టు అన్నాను.

"ఏముంటుంది అసలీ పుస్తకాల్లో! హీరో ఎవర్నో ప్రేమిస్తాడు. మరొకత్తెను పెళ్ళి చేసుకుంటాడు. ఆ హీరోయిన్ పాపం విరహ గీతాలు పాడుకుంటూ కూర్చుంటుంది. అంతేగా?" వ్యంగ్యంగా అంది.

"ఊరుకో తల్లీ. ఎందుకంత ఆవేశపడతావు. అయినా ఈ నవల రొటీన్ నవలలకి కాస్త భిన్నంగా వుంది."

"ఏమిటిట?"

"ఇందులో హీరో ఒక పెయింటర్. పెయింటింగ్‌లో వున్న ఆసక్తి అమ్మాయిలతో స్నేహాలకి, కబుర్లకి వుండదు. అతడి ఆర్ట్‌ని అభిమానించే అమ్మాయిలకీ కొదవ వుండదు. హీరోయిన్ కూడా ఒక అభిమానిలాగే పరిచయం అవుతుంది. అమె అందం చూసి ఆమె చిత్రం గీయాలనిపించి నిజాయితీగా తన మనసులో మాట చెపుతాడు. అతడి నిజాయితీని ప్రేమగా భావించిన ఆ అమ్మాయి ఒంటిమీద నూలుపోగన్నది కూడా లేకుండా తన బొమ్మను గీయటానికి అభ్యంతరం చెప్పదు. కానీ పెళ్ళి విషయం వచ్చేసరికి 'నిన్నా దృష్టితో చూడలేదు. పెళ్ళి చేసుకున్నా సుఖపెట్టలేను' అంటాడు. దాంతో ఆమెలోనూ పట్టుదల పెరిగి అతడితోనే వుంటూ ప్రతి చిన్న విషయానికి అతడు తనపై ఆధారపడేలా పరిస్థితులు కల్పిస్తుంది. అయినా అతడిలో మార్పుండదు. అతడి దృష్టిలో ఆమె ఒక మంచి స్నేహితురాలు. మంచి మనసున్న మనిషి! అంతే!! అతడిని మార్చటం సులభం కాదని గ్రహించి, అతడు పెయింట్ చేసిన తన నగ్న చిత్రాలన్నింటికీ తగిన రంగుల మిశ్రమంతో దుస్తులు ధరించినట్టు పెయింట్ చేసి, అక్కడినుంచి వెళ్ళిపోయేందుకు తయారవుతుంది. ఆమె ఆర్టు చూసి ముగ్ధుడైన ఆ హీరో ఆమెను వివాహమాడటానికి చివరికి ఒప్పుకుంటాడు.

(ఇటువంటి కథ 'వల' అన్న పేరుతో 1960-70ల మధ్య రెండు సంచికలలో వచ్చింది. రచయిత పేరు గుర్తులేదు.)

"ఎవరు రాసింది?" చిన్నగా వినిపించిందా ప్రశ్న.

అడిగింది సరళ కాదు - అతడు! చెప్పాను.

"మీరు పిల్లలకి చేతులూపుతుంటే అంతా చిన్నపిల్లల తరహా అనుకున్నాను. ఇంత గంభీరంగా ఆలోచించగలరని మిమ్మల్ని చూస్తే ఎవరూ అనుకోరు."

సరళ, నేనూ మొహమొహాలు చూసుకున్నాం.

"నిజమండీ..చాలామంది చాలా అకతాయితనంగా అల్లరిచేస్తూ దేన్నీ పట్టించుకోనట్టు వుంటారు. కానీ అంతర్గతంగా వాళ్ళంత గంభీరంగా ఆలోచించేవాళ్ళు చాలా తక్కువ. జీవితంలో వారికి ఎదురయ్యే అనుభవాలు, ఎదురు దెబ్బలు అందుకు కారణం కావచ్చు. ఇంకొంత మంది అమాయకంగా దేన్నీ గ్రహించే శక్తి లేనివారిగా కనిపిస్తారు. చాలా యాంత్రికంగా రోజులు గడిపేస్తున్నట్టు అనిపిస్తారు గాని జీవితాన్ని తీర్చిదిద్దుకోటానికి నిరంతరం కృషి చేస్తూనే వుంటారు. తమ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ముందుకు పురోగమిస్తూ వుంటారు."

అతడంత ఫిలాసఫికల్‌గా మాట్లాడుతుంటే నాకు తెలియకుండానే అడిగాను, 'మీరేం చేస్తుంటారు?' అని. అంతవరకు మా గురించి లొడ లొడ చెప్పేశాం గాని, అతడేం చేస్తున్నాడో ఎక్కడికి వెళ్తున్నాడో - నేనైతే పట్టించుకోలేదు.

జవాబు సరళ నుంచి వచ్చింది, 'మెడికల్ కాన్ఫరెన్సుకి వెళ్తున్నట్టు చెప్పారు కదా!'

"ఓ! డాక్టరా మీరు?"

"అవునండీ. అయితే ప్రయాణాల్లో ఎప్పుడూ డాక్టరునని చెప్పను. మందులు వెంటబెట్టుకుని తిరగం కదా!" చెప్పేం లాభం అన్నట్టు అన్నాడు.

అయితే మధ్యాహ్నం భోజనాల సమయంలో తన డాక్టరు బుద్ధి చూపనే చూపాడు.

"మీరు మరీ అంత తక్కువ తింటే పాఠాలెలా చెప్తారు?"

"........"

"డైటింగా?"

"తనంతే లెండి." సరళ అంది.

"అసలు ఆడవాళ్ళే అంతేననుకుంటా. మా అమ్మ మా చెల్లి కూడా అంతే. ఇళ్ళల్లో బాగానే భోంచేస్తారు. బయట తినాల్సి వస్తే మాత్రం సిగ్గుపడిపోతూ, తినాల్నా వద్దా అన్నట్టు మొక్కుబడిగా తింటారు."

"అసలు మీరు మనుషుల సైకాలజీ మీదేం స్టడీ చెయ్యటం లేదు కదా?" అందరం నవ్వేశాం.

✸ ✸ ✸

సాయంకాలం పూట ప్రయాణం చేస్తూ పసుపు పచ్చటి వరిమళ్ళకు చుట్టూ కనకాంబరాలు, కారబ్బంతి పూల నారుతో కంచెను కట్టినట్టు క్షితిజ రేఖలో పరుచుకునే సింధూర రాగాలను చూస్తూ కూర్చోటం ఒక గొప్ప అనుభూతి.

చిన్న చిన్న వూర్లు - వూర్ల చుట్టూ పంట పొలాలను దాటుకుంటూ రైలు ముందుకు పరిగెడుతుంటే ఆ వూర్లు, ఆ పైరులే మనను వదలటం ఇష్టం లేక మన చుట్టూనే పరిభ్రమిస్తున్నట్టు భ్రమలో పడిపోతాం.

అదే అన్నాను సరళతో - ఒక అందమైన అనుభూతిని పంచుకోటంలో ఆనందం వుంది కాబట్టి.

“అది సరే! ముందు ప్రొఫెసర్ ఇచ్చిన లెటరు ఎక్కడ పరిభ్రమిస్తుందో చెప్పు. బాగ్‌లో పెట్టమన్నాను, పెట్టావా?” హేండ్ బ్యాగ్‌లో అరలన్నీ తీసి చూస్తూ అడిగింది సరళ.

గుండె ఆగిపోయినంత పనయింది నాకు! లైబ్రరీలో పని వున్నన్ని రోజులు హాస్టల్లో వసతి కల్పించాల్సిందిగా ప్రొఫెసర్ ఇచ్చిన ఉత్తరం రూం లోనే వదిలేసి వచ్చాను.

సరళకి అర్థం అయిపోయింది - అది తీసుకురాలేదని.

“ఏం పిల్లవే తల్లీ! అవసరం అయిన ఒక్క పనీ చెయ్యవు. హాస్టల్లో అకామిడేషన్ దొరక్క, లక్ష్మి కూడా ఊర్లో లేకుండాపోతే ఏం చేద్దాం?...” ఇంకా ఏదో అంటూనే వుంది. నా చెవుల్లోకి ఏదీ ఎక్కడం లేదు. నిజమే!... ఏం చెయ్యాలి!!?

“పర్లేదులెండి. రిటైరింగ్ రూమ్సులో లేడీస్‌కి ప్రిఫరెన్స్ వుంటుంది. ముందక్కడ వుండి నిదానంగా హాస్టల్లో ప్రయత్నించవచ్చు.”

సమస్యకు ఒక పరిష్కారం చూపుతూ అన్నాడు. ఆ క్షణం అతడు నాకు ఆపద్బాంధవుడిలాగే అనిపించాడు.

“ఈవిడ చేసే పన్లన్నీ అంతేనండీ! అదో, అలా పుస్తకాలు పట్టుకుని కూర్చోమంటే మాత్రం తయారు.” నవ్వు కలబోసిన కోపం అభినయిస్తూ, చూపుల్తో చీరేస్తూ అంది సరళ.

చెంపల మీదికి జారుతున్న ఒత్తైన జుట్టు పాయతో మొహం దాచేసుకున్నాను నేను. అది చూసి ఇద్దరూ నవ్వారు.

“అలా అనకండి. అది ఏ కొందరు అదృష్టవంతులకో సాధ్యపడే విషయం. పుస్తకాలలో ఆనందం పొందేవారికి మిగతా లోకంతో పనుండదు. వాళ్ళకి బయటి లోకపు కల్మషాలతో పోరాటాలతో ఏమాత్రం సంబంధం వుండదు. నిశ్చింతగా బ్రతికేయగలరు” నాకు సపోర్టు వస్తూ అన్నాడు.



* బ్రెడ్ ఎండిపోయినా లేదా టోస్ట్ మిగిలిపోయినా, దాంతో ఓ చిరుతిండి క్షణాల్లో చేయచ్చు. ఉల్లిపాయ, టమోటో, పచ్చిమిరపకాయ ముక్కలని వేయించి ఈ బ్రెడ్ ముక్కలని అందులో కొద్దిగా ఉప్పుతోపాటు వేసి వేయించి దింపి పైన కొద్దిగా మసాలా పొడి, కొత్తిమీర చల్లి తింటే రుచిగా వుంటుంది.

-భోశ్రీ

“సరి! మీరిలా కితాబులు కూడా యిచ్చారంటే ఇక ఈవిడి అదుగో అక్కడెక్కి కూచుంటానంటుంది.”

“లేదులెండి. మీ ఫ్రెండ్ సింప్లిసిటీలోనే అంతా వుందసలు!”

“ఇదొకటా యింకా! ఔను, అసలేంటి మీరు? ఆవిడని అంతగా సపోర్టు చేస్తున్నారుగాని ఇంతగా చింతపడుతున్న నాకు ఒక్క మంచి మాట చెప్పరు?” వాదంలోకి దిగింది సరళ.

నవ్వాడతను.

“మీరు తెరిచిన పుస్తకం. మిమ్మల్ని అర్థం చేసుకోడానికి పెద్దగా శ్రమ పడక్కర్లేదు. మీ స్నేహితురాలు అలా కాదు. తననర్థం చేసుకోవాలంటే ఓపికగా ఒక్కో పేజీ చదవాలి.”

“బస్. బస్! ములగ చెట్టెక్కించేస్తున్నారు” ఆ విషయానికి ఫుల్‌స్టాప్ పెట్టించేస్తూ అన్నాను నేను.

ఇటువంటి మెచ్చుకోళ్ళు నాకు మామూలే! వయసు మళ్ళిన వ్యక్తులు కూడా ‘ఒద్దికైన పిల్ల’, ఇంత చదువుకున్నా అహంకారం లేదని, మర్యాద మన్నన తెలిసినదాన్నని... సమ వయస్కుల అభిప్రాయం కూడా దాదాపు ఇంతే! ఒకరిద్దరు ఇంత అల్లరి చేసే అమ్మాయిని (సైలెంట్ మిశ్చీఫ్) పెళ్ళెవరు చేసుకుంటారు అని ఆశ్చర్యపడిన సందర్భాలు కూడా వున్నాయి. ఇంకొంతమంది ఆ చనువుని చూసి డైరెక్టుగానో ఇండైరెక్టుగానో దగ్గరవ్వాలని ప్రయత్నించి చూసినవాళ్ళూ వున్నారు. మనసుకు దగ్గరైనవాళ్ళు మాత్రం ఎవరూ లేరు!! ఇప్పుడితడిని భరించగలుగుతున్నానంటే... భరించడం కాదు - ఒకరకంగా ఇష్టపడటం. ఎటువంటి వెకిలితనం లేకుండా, తెచ్చిపెట్టుకున్న డిగ్నిటీతో ఆకర్షించాలని ఏమాత్రం ప్రయత్నించకుండా, చాలా మామూలుగా ఇద్దరు మంచి స్నేహితులు ఎలా మాట్లాడుకుంటారో అలాగే తన పరిధిని దాటకుండా మాట్లాడటం వల్లనే.

మొత్తానికి కబుర్లతో ప్రయాణం పూర్తయింది. సామాన్లన్నీ కట్టేసి రైలు ఆగగానే దిగడానికి సిద్ధంగా కూర్చున్నాం. ఎవరు ఎన్నిరోజులు ఢిల్లీలో వుండేది, తిరిగి ఎప్పుడు ఊర్లు చేరుకునేది, ఎవరం ఎక్కడ వుండేది - వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాం.

రైలు ఆగీ ఆగగానే రిసీవ్ చేసుకోడానికి వచ్చిన స్నేహితుల పలకరింపులు, సామాన్లు దింపుకోడంలో ఎవరెటు వెళ్తున్నారో పట్టించుకోలేదు.

మేం ఆటోలో వెళ్తుంటే అతను ఎక్కిన ఆటో మా పక్కనుంచే పోతోంది.

‘అరె! అతనే! టాటా చెప్పు. టాటా చెప్పు’ బేగులు ఒడినిండా పట్టుకుని కూర్చున్న సరళ తనకు వీలుగాక నన్ను తొందరపెట్టింది.

బుద్ధిమంతురాల్లా చెయ్యూపాను నేను. అతడు నవ్వుతూ చూస్తుండిపోయాడేగాని తిరిగి చెయ్యి మాత్రం ఊపలేదు.

“ఎప్పుడైనా తిరిగి కల్సుకోడం జరిగితే మాట్లాడతారా మీరు?” మా ఇద్దర్నీ చూస్తూ అడిగిన మాట గుర్తొచ్చింది.

ఇద్దరం ఆశ్చర్యపోయాం ఎందుకు మాట్లాడం అని.

“ఏమో! పెళ్ళయ్యాక అమ్మాయిలు అంతకు ముందు తామెరిగిన అబ్బాయిల్ని పలకరించరు సాధారణంగా.”

సరళ, నేను ఇద్దరం వాదించాం - ఆ కాలం మారిపోయిందని.

అతడి నవ్వే సమాధానం.

మొదట తనే మాట కలిపి పరిచయం పెంచుకున్న మనిషి ఇప్పుడు మా ప్రతి మాటకు నవ్వేసి వూరుకోడం! అందులో అప్పుడప్పుడు కాస్త మెచ్చుకోలు కనిపించినా ‘ఆఁ! పిల్లలేదో అనుకుంటున్నార్లే’ అన్న ధోరణే వుంది!

చివరకు విడిపోతూ చెయ్యూపుతున్నా నవ్వేనా సమాధానం!!?

* * *

ఇంకా తెల్లవారలేదు.

ఊరి పొలిమేరల్లో రోడ్డుకు అటుఇటు వున్న టీ బంకులు, చిన్న చిన్న హొటళ్ళు మసక చీకట్లో మునిగిపోయివున్నాయి. ఆ చీకటి తెరలు తొలగించుకుంటూ హొటళ్ళలో పనిచేసే కుర్రాళ్ళ అరుపులు, మైకుల్లో పాటలు, ఇంకేవేవో ధ్వనులు అన్నీ కలగాపులగంగా వినిపిస్తుంటే మరో వింతలోకంలో ఎక్కడో విహరిస్తూ వున్న మనసు ఎదుటి టీ బంకులో చాయ్ తాగొచ్చిన డ్రైవరు తిరిగి కారు స్టార్ట్ చేయడంతో ఈ లోకంలోకి వచ్చింది. అంత వరకు కళ్ళముందు పరుచుకుపోయిన గతం తాలుకు దృశ్యాలన్నీ అదృశ్యం అయిపోయాయి.

ఇంకో రెండు గంటల ప్రయాణం... ఇల్లు చేరుకోడానికి!

ఆ తర్వాత?!

ఆ తర్వాత జరగబోయేది తలుచుకుంటేనే భయంగా వుంది. ఉహూఁ! భయం కాదు. దిగులు! గుండెల నిండా నిండిపోయి బ్రతుకును బరువుగా చేసే దిగులు!

ఇన్ని కటు అనుభవాలు, చేదు నిజాలు రుచిచూడాల్సి వస్తుందని కలలోనైనా ఊహించని భావుకతతో సార్థకత కోసం చేసే పోరాటంలో జీవితం ఎప్పుడు నన్ను ఏ మలుపులో నిలిపిందో కూడా అర్థం కాకపోయినా ముందు ముందు ఏమవనున్నదో అన్న చింత మాత్రం మిగిల్చింది.

ఎప్పుడో ఏదో ప్రయాణంలో పరిచయమైన వ్యక్తి తిరిగి తారసపడతాడని, తనకింత దగ్గర అవుతాడని అనుకుందా తను ఎప్పుడైనా! వివాహమై గుంటూరులో స్థిరపడిన మూడు నాలుగేళ్ళకి డాక్టరు అవసరం అయి వెళ్తే - అక్కడ అతనే! గుర్తుపట్టడం కొంచెం కష్టమే అయింది. బాగా గుండ్రంగా

తయారయాడు. ముందుగా అతనే గుర్తుపట్టి పలకరించాడు.

అతడి భార్య కూడా డాక్టరే. ఇద్దరు పిల్లలు - చదువుకుంటున్నారు - ఇక గుంటూరులో స్థిరపడినట్టే. ఇవి అతడు చెప్పిన వివరాలు. మాట మాటకు చివర అదే చిరునవ్వు!

అప్పటినుంచి అతనే ఫామిలీ డాక్టరు మాకు. స్వతహాగా స్నేహశీలి అవటం వల్ల మావారికి కూడా మంచి మిత్రుడయిపోయాడు. మరీ ముఖ్యంగా నాకు!

ఒక మనిషి పట్ల అభిమానం కలగడానికి ముఖ్య కారణం అతడి అందం, డబ్బు, హెూదా, అతని వ్యక్తిత్వం ఇవేమీ కాదు - చివరికి మనపట్ల వారికున్న ఆదరభావం కూడా కాదు. మనల్ని మన నిజ స్వరూపాన్ని అర్థం చేసుకుని, మన ప్లస్ పాయింట్స్ కాకుండా మన లోటుపాట్లను కూడా స్వీకరించగలగటం! ఆత్మీయతలు పంచుకోవాలంటే అంతర్గత స్వరూపాన్ని అవగాహన చేసుకోగల సామర్థ్యం వుండటం ముఖ్యం. అందుకేనేమో ఇతడు తనకంత దగ్గరగా ఆత్మీయుడిలా అనిపిస్తాడు. మధ్య తరగతి మనిషి మొహాన మందహాసం నిలిపేది కూడా ఇటువంటి ఆత్మీయతలే!

ఇప్పుడు అదే సమస్య అయి కూర్చుంది!

ఉన్నట్టుండి ఊహించనైనా ఊహించని రకంగా నాకు పక్క ఊరికి బదిలీ అవటము - పిల్లల చదువులు పాడుకాకుండా అక్కడే ఇల్లు తీసుకోవడము - రోజూ ఆయన ఇంటికి ఆఫీసుకి తిరగాల్సి రావటంవల్ల ఖర్చుకు ఖర్చే కాకుండా అలిసిపోయి ఇల్లు చేరిన మనిషి అకారణంగానే తన మీద విసుక్కోవడము, ఓపిక నశించి తనూ బదులు చెప్పడము - చిన్న చిన్న మనస్పర్థలు!! ఇవన్నీ తాత్కాలికమైన ఇబ్బందులేనని సర్ది చెప్పుకుంటుంటే ఇప్పుడీ యాక్సిడెంటు!

వెన్నెముకకు బలమైన దెబ్బ తగిలి ఇక లేచి తిరగగలడన్న నమ్మకం లేదని డాక్టర్లు చెప్పినప్పుడు, ట్రీట్‌మెంట్ కోసం బ్యాంకు బేలన్సులన్నీ ఖాళీ అయినప్పుడు, కుటుంబ భారమంతా నేనే మోయాల్సి వచ్చినప్పుడే మాత్రం చలించని మనసు ఇప్పుడు ఆలోచించే శక్తి కోల్పోయినట్టు మొద్దుబారిపోతోంది.

ఇప్పుడు ఇల్లు చేరుకోగానే తను వస్తాడు. మెడికల్ రిపోర్టులన్నీ చూసి ఒక డాక్టరుగానే కాకుండా ఒక మంచి మనిషిగా అవసరమైన ఏర్పాట్లన్నీ చేసి సహాయపడాలని చూస్తాడు.

అప్పుడు ఏ నోటితో ఇకనుంచి మా ఇంటికి రావద్దని చెప్పగలదు? ఏ మాటల్ని పొందుపరచుకుని అతడితో తనీ మాట అనగలదు?

ఆయన గట్టిగా చెప్పాడు - చావనైనా చస్తాను గాని నలుగురూ మన గురించి నాలుగు రకాలుగా అనుకోటం భరించలేను అనీ, అతను ఏర్పాటు చేసిన కారులో చెకప్‌కి వెళ్ళిరావటం ఇదే ఆఖరిసారి అని!!

కాబట్టి చెప్పక తప్పదు... కాని ఎలా?

నాలో జరుగుతున్న అంతర్మథనాన్ని తను గ్రహించినట్టే వున్నాడు. అందుకే మద్రాసుకు బయల్దేరుతుంటే అడిగాడు, 'అలా వున్నావేం' అని.

నా మౌనమే సమాధానం.

"ఏం మాట్లాడకుండా నీలో నువ్వే ఆలోచించుకుని బాధపడితే నాకెలా అర్థమవుతుంది చెప్పు?" ఆ స్వరంలోని మార్దవానికి మనసు చెమ్మగిల్లింది.

ఏం చెప్పను? నీ మంచితనాన్ని మావాళ్ళు భరించలేకపోతున్నారని చెప్పనా? ఏ బంధుత్వము లేని స్త్రీకి ఒక పరాయి వ్యక్తి అండగా నిలబడటం లోకం హర్షించదని చెప్పనా?

అన్నీ తెలిసి ఏమీ తెలియనట్టు, నీపై మోపిన అభాండాలన్నింటినీ చిన్న నవ్వుతో కొట్టిపడేస్తూ అంత ఎత్తుకు ఎదిగిన నీ వ్యక్తిత్వం ముందు నా మనసు రెండు చేతులూ జోడించి తలవాల్చుతోంది అని చెప్పనా?

నిష్కల్మషమైన మనసులతో ఆత్మీయతను పంచుకునే నిన్నూ నన్నూ ఈ లోకం నిర్దాక్షిణ్యంగా వేరుచేసి ఆనందిస్తుంటే, సూటీపోటీ మాటలతో గుండెల్లో పిడికత్తులు గుచ్చుతుంటే భరించలేకపోతున్నానని చెప్పనా?! ఏదని చెప్పను?

ఏనాటిదీ పరిచయం! అసలు ఏమిటీ బంధం ఇద్దరి మధ్యా?!

ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య వుండే మామూలు ఆకర్షణ మాత్రం కాదు.

వ్యక్తుల మధ్య మనము, మన సమాజము స్వీకరించిన మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అయితే, తమ విషయంలో మాత్రం అది నిజంకాదు.

మరి ఏది తమనిద్దరినీ కట్టి పడేసేది?

భర్త - పిల్లలు - అయినవారు - ఎవరికీ ఇవ్వని విలువ, పేరు లేని ఈ అనుబంధానికి ఇస్తున్నాను - దాన్ని ప్రేమ అనుకోడానికి కూడా మనసు అంగీకరించడం లేదు. తనకున్న పరిమితులను కూడా లెక్కచేయకుండా నా ప్రతి సమస్యలోనూ ఆత్మబంధువులా వెంటుండి తగిన సలహాలు ఇస్తూ సహాయపడే ఈ మనిషి అసలు నాకేమవుతాడు?

నాకు ఏమీ కాకుండానే నా జీవన సర్వస్వం అవుతాడనుకున్నానా ఆ రోజు?!

బహుశ నేను సరైన మనిషికే చేయి వూపి వుంటానా రోజు. అందుకే జీవన గమనంలో ఇప్పుడు సహ ప్రయాణీకుల్లా మిగిలాం... ఎప్పుడు ఎవరం ఎక్కడ విడిపోతామో తెలియకుండానే ప్రయాణం సాగిస్తున్నాం. ❑



సంఘసేవలో...

## వేదుల కమలాదేవి

ప్రముఖ పండితులు, మేధావి శ్రీ చర్ల గణపతి శాస్త్రి, సుప్రసిద్ధ సంఘ సేవకురాలు శ్రీమతి సుశీల దంపతుల ద్వితీయ పుత్రికగా డాక్టర్ వేదుల కమలాదేవిని పేర్కొంటే అది అతి సామాన్యమైన విషయం. తల్లిదండ్రుల సుగుణాలన్నిటికి ప్రతినిధిగా ఆమెను వర్ణించడమూ ఏమాత్రమూ అతిశయోక్తి కాదు.

హిందీ, ఇంగ్లీషులలో ఎం.ఏ., ఎమ్.ఫిల్, పి.హెచ్.డిలు కాక 'నాటకాల్లో దేశభక్తి' అనే పరిశోధనా వ్యాసానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ స్వీకరించిన వేదుల కమలాదేవికి బెంగాలీ, సంస్కృతం, ఉర్దూ భాషలలోనూ మంచి ప్రవేశం వుంది. సంగీతంలోనూ ప్రావీణ్యం సంపాదించారు.

మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో సమాజంలో స్త్రీల పరిస్థితిని మెరుగుపరచే కృషిలో నిడదవోలుని కేంద్ర స్థానంగా ఎన్నుకున్నారు డాక్టర్ వేదుల కమలాదేవి.

- కె. వాణీప్రభాకరి

Vemakoti Seeta Rama Sastry
WRITER APSEB JAO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.